# వాన బీభత్సం.. నేలకొరిగిన స్తంభాలు!

- మంచిర్యాలలో అకాల వర్షం.. అంధకారంలో ఏడవ డివిజన్..
- రంగంలోకి మేయర్.. యుద్ధప్రాతిపదికన కరెంటు పనులు..



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కురిసిన అకాల వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఏడవ డివిజన్ లోని స్పెషల్ డీ క్వార్టర్ ప్రాంతంలో భారీ చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. ఈ ప్రమాద ధాటికి నాలుగు కరెంటు స్తంభాలు ఒక్కసారిగా నేలమట్టమయ్యాయి. ఫలితంగా ఆ ప్రాంతమంతా చీకటి అలుముకోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రమాద విషయం తెలియగానే మంచిర్యాల మేయర్ దర్శి మధుకర్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. స్థానిక కార్పొరేటర్ వేల్పుల రవీందర్ తో కలిసి విరిగిపడిన స్తంభాలను.. కరెంటు తీగలను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మేయర్ ఆదేశాలతో సింగరేణి విద్యుత్ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి.. సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు.. సిబ్బంది.. ప్రజలు పాల్గొన్నారు.

# వసూల్ మీది.. అభివృద్ధి మాది!

- కాటా శ్రీనివాస్ గౌడ్ పై ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఫైర్..
- మైనింగ్, భూముల ఆరోపణలపై క్లారిటీ.. బహిరంగ విచారణకు సవాల్..



**పటాన్చెరు, మార్చి 31 (జనం పవర్):**

పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రతిపక్ష నేతలపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా కాటా శ్రీనివాస్ గౌడ్ లక్ష్యంగా ఘాటు విమర్శలు గుప్పించారు. హరీష్ రావును విమర్శించే స్థాయి అతనికి లేదని మండిపడ్డారు. వసూల్ రాజాగా పేరుపొందిన వ్యక్తికి అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు లేదని ఎద్దేవా చేశారు. తమది అభివృద్ధి నినాదమైతే.. కాటాది అవినీతి చరిత్ర అని దుయ్యబట్టారు.

## అవినీతి రాజకీయాలు

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు రాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో డబ్బులు వసూలు చేయడం.. బీఫాంలు అమ్ముకోవడం అతనికి అలవాటుగా మారిందని ఆరోపించారు. మంత్రి కుమార్తె పెళ్లి పేరుతో కోట్లు వసూలు చేసిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. స్వార్థం కోసం కన్నతల్లిని సైతం ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర కాటాదని ధ్వజమెత్తారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అమ్ముకున్నారని.. సర్పంచ్‌గా కూడా సరిగ్గా పనిచేయలేని అసమర్థుడని విమర్శించారు.

## మైనింగ్ కేసులపై వివరణ

లకడారం గ్రామంలోని తమ కుటుంబ క్వారీ 2012 నుంచి అన్ని అనుమతులతో నడుస్తోందని తెలిపారు. 2024లో రాజకీయ కక్షతోనే సీజ్ చేసి అన్యాయంగా మూడు వందల కోట్ల జరిమానా విధించారని ఆరోపించారు. హైకోర్టు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రీ-సర్వేకు ఆదేశించినా అమలు కాకపోవడం వెనుక రాజకీయ కుట్ర ఉందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారమే మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నామని స్పష్టం చేశారు.

## భూముల వివాదంపై స్పష్టత

పోచారం సర్వే నంబర్ 62లోని ఐదు ఎకరాల భూమితో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. తాను ఒక్క గజం భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే బహిరంగ విచారణకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రజల కోసం తాను వందల ఎకరాలు అమ్ముకున్నానని.. ఎవరినీ మోసం చేయలేదని తెలిపారు.

# గడ్డి మందుపై నిషేధం.. వినోద్ కుమార్ హర్షం!

**అసెంబ్లీలో తీర్మానం చేయడంపై స్వాగతం..**



**కోహెడ, మార్చి 31 (జనం పవర్):**

గడ్డి మందును (పారాక్వాట్ డిక్లోరైడ్) నిషేధిస్తూ రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వం తీర్మానం చేయడం పట్ల బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు.. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వినోద్ కుమార్ మనస్ఫూర్తిగా స్వాగతించారు. గడ్డి మందు వల్ల సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలు.. వందల సంఖ్యలో మనుషులు.. యువతీ యువకులు ఆత్మహత్యలు చేసుకుంటుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. గత రెండు నెలలుగా తాను గళమెత్తి పోరాడుతున్నానని ఆయన పేర్కొన్నారు.

## రెండు నెలల సుదీర్ఘ పోరాటం

గత రెండు నెలలుగా తాను చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని వినోద్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. గడ్డి మందును నిషేధించాలని గత ఫిబ్రవరి 21న బంజారా హిల్స్ తెలంగాణ భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించి ప్రభుత్వాన్ని కోరినట్లు గుర్తు చేశారు. ఆ తర్వాత మార్చి 3న అఖిల పక్షంతో పాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి.. ఈ విషపూరిత మందు వల్ల సమాజానికి కలిగే అనర్థాలను వివరించినట్లు ఆయన తెలిపారు.




# రిషి స్కూల్ వార్షికోత్సవం అదరహో!

**వైభవంగా 33వ వార్షిక వేడుకలు.. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అద్భుతం**

**సంగారెడ్డి, మార్చి 31 (జనం పవర్):**

సంగారెడ్డి పట్టణంలోని రిషి ఉన్నత పాఠశాల 33వ వార్షికోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థులు.. తల్లిదండ్రులు.. ఉపాధ్యాయుల సమక్షంలో ఈ కార్యక్రమం ఎంతో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ముప్పై మూడు ఏళ్లుగా విద్యా రంగంలో రాణిస్తున్న ఈ పాఠశాల వేడుకలు కనువిందుగా సాగాయి. ఈ వేడుకకు సైకాలజిస్ట్ సుధీర్ సాంద్ర.. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి.. ఎంఈఓ విద్యాసాగర్.. సీనియర్ అడ్వకేట్లు వీరారెడ్డి.. దామోదర్ రెడ్డి.. డైరెక్టర్ నాగిరెడ్డి.. ప్రిన్సిపాల్ లక్ష్మీ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా సాంస్కృతిక.. నైపుణ్య రంగాల్లో కూడా రాణించాలని వారు సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాల చేస్తున్న కృషిని అతిథులు ప్రశంసించారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలు.. నాటకాలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు.. అతిథులు అభినందనలు కురిపించారు. ఈ వేడుక అత్యంత ఆనందభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



# మల్కాపూర్ ప్రగతి బాట!

**నాలుగు నెలల్లోనే మారిన ఊరి రూపురేఖలు..**

**ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: సర్పంచ్ అనిల్ కుమార్..**

**కొండాపూర్, (జనం పవర్):**



మల్కాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే పట్టుదలతో సర్పంచ్ మామిడిపల్లి అనిల్ కుమార్ ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన అతి తక్కువ కాలంలోనే అనేక అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రతి సమస్యపై వెంటనే స్పందిస్తూ.. అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారు.

## సంక్షేమ పథకాల అమలే ఊపిరి

పేద ప్రజల అవసరాలను గుర్తించి రేషన్ కార్డులు.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పనులను వేగవంతం చేశారు. తాగునీటి సమస్య శాశ్వతంగా తీర్చేందుకు కొత్తగా బోర్లు వేయించారు. గ్రామం చుట్టుపక్కల ప్రజలందరికీ సౌకర్యంగా ఉండేలా మార్కెట్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిలిచిపోయిన పనులను పట్టాలెక్కించి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు.

## మహిళా సాధికారత.. మెరుగైన వసతులు

మహిళల అభ్యున్నతి కోసం నాలుగు మహిళా సమైక్య భవనాలు మంజూరు చేయగా.. అందులో రెండు ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్నాయి. ఊరి రోడ్ల మీద ఉన్న గుంతలను మొరంతో పూడ్చి ప్రయాణ ఇబ్బందులు తొలగించారు. చీకటి పడితే భయం లేకుండా ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి వీధులను వెలుగులతో నింపారు. గ్రామ పంచాయతీ భవనాన్ని అన్ని వసతులతో ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. సర్పంచ్ అనిల్ కుమార్ చేస్తున్న కృషిని గ్రామ ప్రజలు హర్షిస్తున్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో సంగమేశ్వర్!

**కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వం..**

**పెద్దల ఆశీస్సులతో ప్రజా సేవకు అంకితం..**

**సంగారెడ్డి, మార్చి 31 (జనం పవర్):**



భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కోవూరి సంగమేశ్వర్ ఎంపికయ్యారు. పార్టీలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర నాయకత్వం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావుకు ఈ సందర్భంగా సంగమేశ్వర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ సీనియర్ నాయకులు రఘునందన్ రావు.. బీబీ పాటిల్.. ఎంఎల్సీ అంజిరెడ్డి.. జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డితో పాటు పార్టీ కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారంతో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తానని సంగమేశ్వర్ పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. తన నియామకం పట్ల స్థానిక నాయకులు.. కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు.

# వైద్య శిబిరానికి పోటెత్తిన జనం!

**నిపుణులైన డాక్టర్లతో పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ..**

**ఆసుపత్రిలో వెంటనే వైద్యులను నియమించాలి: సర్పంచ్ శ్రీధర్..**



**బెజ్జంకి, మార్చి 31 (జనం పవర్):**

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జనరల్ ఫిజీషియన్.. ఆర్థోపెడిక్.. కంటి వైద్యులు.. గైనకాలజిస్టులు రోగులకు క్షుణ్ణంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బాధితులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్ (పెద్దన్న) ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బెజ్జంకి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న వైద్యులను కూడా డిప్యూటేషన్ పేరిట జిల్లా ప్రధాన ఆసుపత్రికి పంపడం అన్యాయమని పేర్కొన్నారు. దీనివల్ల స్థానిక రోగులు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు. జిల్లా వైద్యాధికారి తక్షణమే స్పందించి.. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. వైద్యులను నియమించి సామాన్యులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని సర్పంచ్ విన్నవించారు. ప్రభుత్వ ఆసుపత్రిని నమ్ముకున్న పేదలకు అన్యాయం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధూమాల మహేష్.. వైద్యాధికారిని మాధురి.. సిబ్బంది.. స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా శకటోత్సవం.. నిబంధనలు తప్పనిసరి!

**మద్యం తాగి బండ్లు నడిపితే కేసులు.. బ్రీత్ అనలైజర్ తనిఖీలు..**

**మహిళల పట్ల అసభ్యత.. ఈవ్ టీజింగ్ చేస్తే కఠిన చర్యలు: ఎస్సై సౌజన్య..**



**బెజ్జంకి, మార్చి 31 (జనం పవర్):**

బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జరగనున్న శకటోత్సవాలను భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై బోయిని సౌజన్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆలయ కమిటీ.. ఎడ్ల బండ్ల యజమానులు.. యువకులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. జాతర సమయంలో ఎడ్ల బండ్ల యజమానులు.. ఇతర వాహనదారులు ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే సహించేది లేదని ఎస్సై హెచ్చరించారు. అలాంటి వారిని గుర్తించేందుకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తామని.. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జాతరలో యువత సత్ప్రవర్తనతో మెలగాలని సౌజన్య సూచించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా.. ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా చట్టప్రకారం శిక్షిస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు.. యువత సమన్వయంతో ఉండి ఈ మహా జాతరను విజయవంతం చేయాలని ఆమె విన్నవించారు.

# తక్కళ్లపల్లిలో సీసీ రోడ్డు పనులు షురూ!

**ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో నిధుల మంజూరు..**

**కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన సర్పంచ్ సగుణ..**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా.. ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో నాలుగు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ దడ్డి సగుణ (విలాస్) ఈ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు సభ్యురాలు మడె వనిత.. గ్రామ కార్యదర్శి శాంతయ్య పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పుప్పాల గజేందర్.. గ్రామ పెద్దలు.. యువకులు.. నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించిన అనంతరం.. రోడ్డు నిర్మాణాన్ని నాణ్యతతో.. వేగంగా పూర్తి చేయాలని సర్పంచ్ అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం అభినందనీయమని ఈ సందర్భంగా గ్రామస్థులు పేర్కొన్నారు.

# నిరుపేదలకు వరం.. సీఎం సహాయనిధి!

**ఎలుకల్ వాసికి 60 వేల రూపాయల చెక్కు పంపిణీ..**

**ఆపదలో ఉన్న వారికి అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి..**



**దుబ్బాక, మార్చి 31:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఒక గొప్ప వరంగా నిలుస్తోందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. రాయపోల్ మండలం ఎలుకల్ గ్రామానికి చెందిన జల రమేష్‌కు మంజూరైన 60 వేల రూపాయల విలువైన చెక్కును మంగళవారం దుబ్బాకలో ఆయన స్వయంగా పంపిణీ చేశారు. అనారోగ్యం.. ఇతర ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇబ్బంది పడుతున్న సామాన్యులకు ఈ నిధి ఎంతో భరోసా ఇస్తుందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడే వారికి ఈ నిధి ద్వారా తక్షణ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిరంజీవి.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాపని వీరస్వామి.. స్థానిక నేతలు పాల్గొన్నారు. సాయం అందుకున్న బాధితుడు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు.. ప్రభుత్వానికి తన కృతజ్ఞతలు తెలియజేశారు.

# కల్తీకల్లు మత్తులో కందర్‌పల్లి!



**చిత్తు అవుతున్న యువత..**

**చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు..**

**యథేచ్ఛగా అమ్మకాలు..**

**నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు..**



**జుక్కల్, (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపల్ పరిధిలోని కందర్ పల్లి గ్రామంలో కల్తీకల్లు విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయి. ఎటువంటి భయం లేకుండా యథేచ్ఛగా సాగుతున్న ఈ దందా వల్ల అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో దీపాల్లా మారుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుండి వందలాది మంది యువకులు ఇక్కడికి వచ్చి కల్తీకల్లుకు బానిసలవుతున్నారు. తాగిన మత్తులో ఎక్కడపడితే అక్కడ పడి ఉంటూ మతిస్థిమితం కోల్పోతున్నారు.

## మత్తులో మాయాలోకం

చెట్ల నుండి వచ్చే స్వచ్ఛమైన కల్లు అని నమ్మి ప్రజలు ఈ విషాన్ని సేవిస్తున్నారు. నీళ్లతో కలిపి తయారు చేస్తున్న ఈ కల్తీకల్లు తాగగానే మనిషి మాయాలోకంలోకి వెళ్లేలా మత్తు పదార్థాలు కలుపుతున్నారు. దీనివల్ల కాలక్రమేణా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కల్లు డిపోల వద్ద మీరాజ్.. రాజ్ నివాస్.. సాగర్.. విమల్ వంటి నిషేధిత గుట్కాలను కూడా బహిరంగంగానే విక్రయిస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యం

గ్రామంలో ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు గానీ.. స్థానిక అధికారులు గానీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్లు డిపోలపై దాడులు చేయాలని కోరుతున్నారు. కల్లులో కలిపే మత్తు పదార్థాల మోతాదును తనిఖీ చేసి.. నిబంధనలు పాటించని డిపోలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విన్నవిస్తున్నారు.



# న్యాయవాదుల రక్షణ చట్టం.. పండగలా సంబరాలు!




**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు..**

**సంగారెడ్డి కోర్టులో మిఠాయిలు పంచి సంబరం..**

**సంగారెడ్డి, మార్చి 31 (జనం పవర్):**

తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావడంతో సంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రక నిర్ణయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ కోర్టు ప్రాంగణంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. న్యాయవాదులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని అభినందనలు తెలుపుకున్నారు.

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు

న్యాయవాదుల భద్రత కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని వారు పేర్కొన్నారు. వృత్తి పరమైన రక్షణ కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ చట్టం వల్ల న్యాయవాదులు నిర్భయంగా తమ విధులను నిర్వహించుకునే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ చట్టంతో పాటు న్యాయవాదుల సంక్షేమం కోసం మరికొన్ని చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 41ఏ సీఆర్పీసీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని.. అలాగే న్యాయవాదులందరికీ శాశ్వత హెల్త్ కార్డులు అందించాలని విన్నవించారు. ఈ డిమాండ్లపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమకు అండగా నిలవాలని న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు.

# ఎస్సీ యువతకు స్వయం ఉపాధి వరాలు!

- **వాహనాలు.. సోలార్ పంపులపై భారీ రాయితీలు..**
- **ఏప్రిల్ 8 లోగా దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్ కుమార్ దీపక్..**

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లాలోని షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతీ యువకులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. రవాణా.. వ్యవసాయ.. పశు సంవర్ధక రంగాలలో స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలపై 90 శాతం.. త్రిచక్ర వాహనాలపై 70 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వీటి ద్వారా నిరుద్యోగులు తమ కాళ్ల మీద తాము నిలబడవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు.



## వ్యవసాయ.. పశు సంవర్ధక పథకాలు

వ్యవసాయ రంగంలో సోలార్ పంపుల ఏర్పాటుకు వంద శాతం కార్పొరేషన్ రాయితీ కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. పశు సంవర్ధక పథకాల కింద పాడి పశువుల పంపిణీకి 70 శాతం రాయితీ.. 30 శాతం బ్యాంకు రుణం అందిస్తామన్నారు. అలాగే నిరుద్యోగ యువతకు జాతీయ స్థాయి సంస్థల ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి.. వేతన ఉపాధి పొందేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పథకాల వల్ల జిల్లాలోని వందలాది కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

## దరఖాస్తు ప్రక్రియ.. అర్హతలు

ఈ పథకాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభై వేలు.. పట్టణాల్లో రెండు లక్షల లోపు ఉండాలి. వయస్సు 21 నుండి 50 ఏళ్ల లోపు (వ్యవసాయ పథకాలకు 60 ఏళ్లు) ఉండాలి. ఆధార్.. రేషన్ కార్డు.. కుల.. ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు సంబంధిత పత్రాలను జత చేయాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 8వ తేదీ లోపు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని మండల.. మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని కలెక్టర్ కోరారు.

# గ్రామసభలు పకడ్బందీగా ఉండాలి!

- ప్రజా పాలన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు..



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ.. వార్డు సభలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.. ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు.. అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సభల నిర్వహణపై కీలక దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రణాళిక ప్రకారం ఈ సభలు జరగాలని స్పష్టం చేశారు. గ్రామ.. వార్డు సభలు తెలంగాణ గీతంతో ప్రారంభించాలని మంత్రి సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల ప్రసంగం తర్వాత ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రజలకు చదివి వినిపించాలని తెలిపారు. రైతు భరోసా.. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. ఇందిరమ్మ ఇళ్లు.. సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలను సభలో చదివి వినిపించి.. అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని వెల్లడించారు.

## కొత్త పథకాలపై ప్రచారం

జూన్ 2వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా.. పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం.. మధ్యాహ్న భోజన పథకాల గురించి ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క కోరారు. సాంస్కృతిక కళాకారుల ద్వారా ఈ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఏప్రిల్ 1 నుండి ఆన్‌లైన్ ద్వారానే టోకెన్లు జారీ చేయాలని.. మ్యానువల్ విధానం ఇకపై ఉండదని స్పష్టం చేశారు.

## మంచిర్యాలలో ఏర్పాట్లు పూర్తి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సభలు జరిగే చోట ఆడియో వ్యవస్థ.. త్రాగునీరు.. మహిళలు.. పురుషులకు ప్రత్యేక వసతులు కల్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి సందేశం వినిపించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ఫ్లెక్సీలు.. బ్యానర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య.. మున్సిపల్ కమిషనర్లు.. ఇతర అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు!

- గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు..
- ప్రాథమిక స్థాయిలోనే ప్రతిభను గుర్తించాలి: డీవైఎస్ఓ వెంకట నరసయ్య..





**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

జిల్లా కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి (డీవైఎస్ఓ) వెంకట నరసయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి.. వారిని మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు క్రీడా పాఠశాలలు గొప్ప వేదికలని ఆయన పేర్కొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు సమాజంలో మంచి గుర్తింపు.. గౌరవం లభిస్తాయని చెప్పారు.

## అంతర్జాతీయ స్థాయి శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతీయ క్రీడా పాఠశాలలు అందుబాటులో ఉన్నాయని.. ఒక్కో పాఠశాలలో నలభై మంది బాలబాలికలను ఎంపిక చేస్తారని నరసయ్య వివరించారు. ఎంపికైన విద్యార్థులకు అత్యున్నత స్థాయి శిక్షణ అందిస్తారని.. భవిష్యత్తులో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడల్లో దేశం తరపున ఆడేలా వారిని సిద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఈ ఎంపిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 110 మంది విద్యార్థులు అర్హత సాధించగా.. 80 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి.. క్రీడా సమాఖ్య కార్యదర్శి సౌందర్య.. మాజీ కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి.. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్.. లక్ష్మీనారాయణ.. వెంకటస్వామి.. డేవిడ్ రవి.. సుశీల.. మాలతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఎంపికలను విజయవంతం చేశారు.



# అభివృద్ధి బాటలో సిద్దిపేట.. 36 అంశాలకు ఆమోదం!

- మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ కేటాయింపులు.. ఏకగ్రీవంగా తీర్మానాలు..
- పారిశుద్ధ్యం.. వీధి దీపాల నిర్వహణకు పెద్దపీట..



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ కడవేరు మంజుల రాజనర్సు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు.. కమిషనర్ అశ్రిత్ కుమార్.. కౌన్సిల్ సభ్యులు.. కో-ఆప్షన్ సభ్యులు.. ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన మొత్తం 36 ఏజెండా అంశాలను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. వార్డుల్లో ఉన్న పలు సమస్యలను సభ్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా.. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. పట్టణంలోని మౌలిక వసతుల కల్పన కోసం కౌన్సిల్ భారీగా నిధులు కేటాయించింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాల కోసం రూ.1602.50 లక్షలు.. నీటి సరఫరా.. వీధి దీపాలు.. పారిశుద్ధ్యం.. భూగర్భ మురుగు కాలువల నిర్వహణకు రూ.798.5 లక్షలు కేటాయించారు. వర్షాకాలం రాకముందే మురుగు కాలువలు శుభ్రం చేసేందుకు రూ.50 లక్షలు.. వనమహోత్సవ పనులకు రూ.100 లక్షలు.. జంక్షన్ల నిర్వహణకు రూ.20 లక్షల వ్యయానికి ఆమోదం తెలిపారు. అలాగే మున్సిపల్ షట్టర్ల మరమ్మతులు.. వాహనాల ఇన్సూరెన్స్.. తాగునీటి వాహనం అద్దె వంటి పనులకు కూడా నిధులు కేటాయించారు.

## విద్యుత్.. మౌలిక వసతుల మెరుగుదల

పట్టణంలో వెలుగులు నింపేందుకు 43 వార్డుల్లో వీధి దీపాల నిర్వహణకు రూ.50 లక్షలు.. కొత్తగా హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.20 లక్షలు.. ఎల్ఈడి సామాగ్రి కొనుగోలుకు రూ.50 లక్షలు మంజూరు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్ మరమ్మతులకు రూ.8.85 లక్షలు.. స్వచ్ఛ బడి కార్యక్రమానికి రూ.15 లక్షలు.. ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం పనులకు రూ.10 లక్షలు కేటాయించారు. మమ్మయమ్మ దేవాలయం ప్రహరీ.. 39వ వార్డులో బురుజు పునరుద్ధరణ.. 3వ వార్డులో గౌడ సంఘం ప్రహరీ గోడ నిర్మాణ పనులకు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది. ఈ నిర్ణయాల వల్ల పట్టణ రూపురేఖలు మరింత మారుతాయని అధికారులు వెల్లడించారు.

# సింహ వాహనంపై నరసింహుడు!

**బెజ్జంకిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు..**

**పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు.. శకటోత్సవం..**



**బెజ్జంకి, మార్చి 31 (జనం పవర్):**

బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పురవీధుల్లో జరిగిన ఈ ఊరేగింపులో మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వేదమంత్రాల ఘోష.. మేళతాళాల హోరు మధ్య ఉత్సవమూర్తి వైభవంగా కదిలారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శకటోత్సవ కార్యక్రమం సాయంత్రం జరగనుంది. గుట్ట చుట్టూ ఎడ్ల బండ్లు.. గుర్రపు బండ్లు.. మేకపోతుల బండ్లు తిరగనున్నాయి. ముఖ్యంగా మేకపోతులను రంగురంగుల పూలతో.. ఆభరణాలతో ముస్తాబు చేసిన బండ్లు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ కనువిందు చేసే వేడుకను చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.

# గ్రామసభలను విజయవంతం చేయాలి

**24 గ్రామాల్లో ప్రత్యేక సభలకు ఏర్పాట్లు..**

**ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలి: ఎంపీడీవో ప్రవీణ్..**

**బెజ్జంకి, మార్చి 31 (జనం పవర్):**




బెజ్జంకి మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో గురువారం నిర్వహించనున్న ప్రత్యేక గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో కడవెరుగు ప్రవీణ్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు.. సమస్యల పరిష్కారానికి ఈ సభలు కీలకమని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు ఈ సభలకు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. సంబంధిత సర్పంచులు.. వార్డు సభ్యులు.. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలను సమీకరించాలని కోరారు. సభల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా.. పారదర్శకంగా జరిగేలా జాగ్రత్త వహించాలని ఎంపీడీవో స్పష్టం చేశారు.

# అభివృద్ధి పథంలో పొన్నారం

**పదమూడు లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం..**

**కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన సర్పంచ్ మధు..**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గ్రామంలోని మూడవ వార్డులో పదమూడు లక్షల ఎనభై వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు బుధవారం అంకురార్పణ జరిగింది. గ్రామ సర్పంచ్ పెంచాల మధు ఈ పనులను శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

## మంత్రి సహకారంతో నిధుల మంజూరు

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర కార్మిక.. గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆశీస్సులతో ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధుల నుండి వీటిని కేటాయించినట్లు వెల్లడించారు. గ్రామంలో ఇంకా మిగిలి ఉన్న డ్రైనేజీ పనులు.. వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంచాల అమృత.. వార్డు సభ్యులు సురిమిళ్ళ పద్మ.. మేకల వంశీ.. బోరకుంట లక్ష్మణ్.. సంకే శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య.. కాంగ్రెస్ నాయకులు పెంచాల రాజలింగు.. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తమ వార్డులో రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





